
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | గురువారం 3 ఏప్రిల్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-


## అసత్య ప్రచారానికి

# తిప్పికొట్టాలి



- మంత్రులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు
- ప్రవీణ్ డెత్ మిస్టరీ ఛేదనలో సీసీ కెమెరాలది కీలక పాత్ర
- పవీణ్ మరణానికి సంబంధించి సీసీ కెమెరాల్లో ఒక్కో అంశం బయటకు వస్తోంది
- సోషల్ మీడియాలో మంచి ఉద్దేశంతో పోస్టులు పెడుతుంటే వాటిని వక్రీకరించి చెడు సందేశాలను వ్యాప్తి చేస్తున్నారు
- మంచి చెప్పుకోవడానికి ఇబ్బందులు పడుతుంటే లేని నిందలు మనపై వేసే కుట్రలు చేస్తున్నారు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని వైసీపీ చూస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయిన సీఎం.. పలు రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ప్రవీణ్ మరణానికి సంబంధించి సీసీ కెమెరాల్లో ఒక్కో అంశం బయటకు వస్తోందన్నారు. ప్రవీణ్ డెత్ మిస్టరీ ఛేదనలో సీసీ కెమెరాలది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. మనం అప్రమత్తంగా లేకుంటే.. బాబాయ్ గొడ్డలి, కోడికత్తి, గులకరాయి తరహాలో అన్నీ మనపైనే వేస్తారని అన్నారు. చేసిన మంచి చెప్పుకోవడానికి ఇబ్బందులు పడుతుంటే లేని నిందలు మనపై వేసే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో మంచి ఉద్దేశంతో - మిగతా3లో

## స్వరాష్ట్రాలకు హోంగార్డుల

# బదిలీలు చేయండి



### హోం మంత్రి అనితకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వినతి

**అంకుశం ప్రతినిధివిజయవాడ: ఏప్రిల్ 3**

ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ స్థానికత కలిగిన హోంగార్డులను స్వరాష్ట్రాలకు బదిలీ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారితో సంప్రదించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని హోమ్ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ ఈ అంశంపైనా విజ్ఞప్తి చేయగా హోమ్ మంత్రి అనిత సానుకూలంగా స్పందించారు. పదిహేనేళ్ల క్రితం హోమ్ గార్డులుగా నియామకమైన తెలంగాణ వారు ఆంధ్ర ప్రదేశ్ లోను, ఆంధ్ర ప్రదేశ్ వారు తెలంగాణలోనూ పని చేస్తున్నారు. ఇంటర్మీడియట్ వరకు వీరు తెలంగాణాలో విద్య పూర్తీ చేసి తెలంగాణాలో నాన్ లోకల్ గా, ఆంధ్ర ప్రదేశ్ లో విద్య పూర్తి చేసిన హోమ్ గార్డులు తెలంగాణాలో నాన్ లోకల్ గా పరిగణనలోకి రావడం వలన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రామకృష్ణ వివరించారు. స్థానికత కారణంగా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందుకోలేక పోతున్నారని సిపిఐ నేత హోమ్ మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు.వీరి పిల్లల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ లకు చెందిన హోమ్ గార్డులను స్వంత రాష్ట్రాలకు బదిలీ చేయాలనీ, ఇందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కూడా అంగీకారం తెలిపారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ వివరించారు. దీని పైన మంత్రి సానుకూలంగా స్పందించి సీఎం గారి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## 7 నుంచి ఆరోగ్యశ్రీ

# సేవలు బంద్



- బకాయిలు చెల్లించాలని పదే పదే విజ్ఞప్తి చేసినా కూటమి సర్కార్ స్పందించడం లేదు.
- ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ
- బకాయిలు భారీగా పేరుకుపోవడంతో సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటన
- "అప్పుల భారం మోయలేక, బాధలు భరించలేక.. ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి విజయవాడ**

ఈ నెల 7 నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేయనున్నట్లు ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. బకాయిలు చెల్లించాలని పదే పదే విజ్ఞప్తి చేసినా కూటమి సర్కార్ స్పందించడం లేదు. దీంతో బకాయిలు భారీగా పేరుకుపోవడంతో సేవలు నిలిపివేస్తున్నట్లు ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. ఏప్రిల్ 7 నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలను పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించామని తెలిపారు. "అప్పుల భారం మోయలేక, బాధలు భరించలేక.. ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు. ప్రతీ నెలా నెట్ వర్క్ ఆసుపత్రుల నుంచి రూ.330 కోట్ల రూపాయల సేవలు అందిస్తున్నాం. బకాయిలు చెల్లిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. సగం కూడా రావడం లేదు. నెట్ వర్క్ ఆసుపత్రులకు రావాల్సిన బకాయిలు రూ. 3500 కోట్ల వరకూ పేరుకుపోయాయి. మందులు, పరికరాలు అప్పులిచ్చే కంపెనీలు పూర్తిగా నిలిపివేశాయి. బ్యాంకుల నుంచి ఓవర్ డ్రాఫ్ట్‌లో డబ్బులు తెచ్చుకునే పరిస్థితి లేదు. ఆసుపత్రులు వైద్యులకు జీతాలిచ్చే పరిస్థితిలో లేవు' - మిగతా3లో

## కంచ గచ్చిబౌలి భూముల్లో

# చెట్ల కొట్టివేతపై స్టే




**అంకుశం ప్రత్యేక ప్రతినిధి న్యూఢిల్లీ**

హెచ్‌సీయూ భూముల వివాదంపై దేశ సర్వోన్నత న్యాయ స్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ విధ్వంసం చాలా తీవ్రమైన విషయమన్న సుప్రీం కోర్టు.. చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకుంటారా? అని తెలంగాణ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేత సహా అన్ని పనులను తక్షణమే నిలిపివేయాలంటూ గురువారం స్టే ఆదేశాలు జారీ చేసింది.వరుసగా మూడు రోజులు సెలవు రావడంతో పోలీసుల సాయంతో హెచ్‌సీయూ భూముల్లో పెద్ద ఎత్తున చెట్లు నరికేశారని ఫిర్యాదు సుప్రీం కోర్టుకు చేరింది. ఈ పిటిషన్‌పై మధ్యాహ్నం తర్వాత జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వంపై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "అంత అత్యవసరంగా చెట్లను నరకాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది?. సీఎస్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఏం చేస్తున్నారు?. పర్యావరణ విధ్వంసంపై సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఇలా ఎలా చేస్తారు?. చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకుంటారా?. ఇది చాలా తీవ్రమైన విషయం. - మిగతా3లో

## న్యాయమూర్తులంతా ఆస్తుల వివరాలు వెల్లడించాలి

- న్యాయమూర్తుల ఆస్తులపై కీలక నిర్ణయం
- న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కూడా సీజేఐ నిర్ణయం
- ఫుల్‌కోర్టు సమావేశంలో తమ ఆస్తులను భారత న్యాయమూర్తికి వెల్లడించేందుకు అంగీకారం
- గతంలో కూడా సుప్రీం కోర్టు న్యాయమూర్తుల ఆస్తుల వివరాలపై కొంతమేర చర్చ జరిగింది.
- ప్రతి ఏడాదీ క్రమంగా తమ ఆస్తుల వివరాలను భారత ప్రధాన న్యాయమూర్తికి వెల్లడించాలి

## రామానాయుడు స్టూడియోకు

# కేటాయించిన భూములు రద్దు

### షోకాజ్ నోటీసులు జారీ చేసిన ప్రభుత్వం

**(అంకుశం, విశాఖపట్నం, ఏప్రిల్ 3)**

విశాఖపట్నం నగర శివారులో రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూములను ప్రభుత్వం రద్దు చేసింది. స్టూడియోకు కేటాయించిన స్థలంలో నివాస స్థలాల అంశంపై ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నివాస స్థలాలుగా మార్పు చేయాలని తలపెట్టిన 15.17 ఎకరాల భూ కేటాయింపు రద్దు చేయాలని నిర్ణయించింది. నిర్దేశించిన ప్రయోజనం కోసం ఇచ్చిన భూమిని అప్రయోజనం కోసం వినియోగిస్తే రద్దు చేయాలన్న సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం.. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోదియా ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా స్టూడియో నిర్మాణం, తత్సంబంధిత అవసరాల కోసం మాత్రమే కేటాయించిన 34.44 ఎకరాల భూమి వాడాల్సి ఉండగా.. అందులో 15.17 ఎకరాలను ఇళ్ల లేఅవుట్ కోసం వైకాపా హయాంలో రామానాయుడు స్టూడియో అభ్యర్థించింది. దీనిని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ భూమార్పిడిని అనుమతిం చొద్దని జనసేన నేత మూర్తి యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాజాగా ఈ భూముల రద్దుకు సంబంధించి రామానాయుడు స్టూడియోకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆర్పీ సిసోదియా ఆదేశించా రు.

# అసత్య ప్రచారానికి తిప్పికొట్టాలి

-మొదటిపేజీ తరువాయి

పోస్టులు పెడుతుంటే వాటిని వక్రీకరించి చెడు సందేశాలను వ్యాప్తి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నింటిపై అప్రమత్తంగా ఉంటూ కుట్రలను తిప్పికొడదామని మంత్రులకు సీఎం సూచించారు. గత వైసీపీ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను ఆప్కాస్ ద్వారా దుర్వినియోగం చేసిందని విమర్శించారు. విచ్చలవిడి నియామకాలతో వ్యవస్థలను నాశనం చేశారన్నారు. ఒక టీటీడీలోనే 4వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు సరైన విధివిధానాలు అవసరమన్నారు. కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఔట్ సోర్సింగ్ నియామకాలను సక్రమ పద్ధతికి తీసుకొద్దామని తెలిపారు. స్వర్ణ గ్రామం పేరుతో ఉన్నతాధికారులు పల్లె నిద్ర చేయాలి అని సీఎం ఆదేశించారు. ఉన్నతాధికారులు 3 రోజులు, 2 రాత్రులు పల్లెనిద్ర చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి పల్లెనిద్ర, పల్లె వెలుగు, స్వర్ణ గ్రామం పేర్లు పరిశీలన చేయాలన్నారు. ఇరుగుపొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ ఇచ్చే సంక్షేమ పథకాలు నాలుగు రెట్లు అధికమని చెప్పుకొచ్చారు. ఇంత చేసి సరైన ప్రచారం చేసుకోలేక పోతున్నాం అని కేబినెట్ అనంతరం సీఎం అన్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కర్మయోగి ట్రైనింగ్ ప్రోగ్రామ్‌పై కేబినెట్‌లో చర్చించారు. విజన్



2047పైన మంత్రులతో చర్చించారు. శాఖలకు స్వయంప్రతిపత్తి కల్పించే దిశగా ఆప్కాస్‌ను ఎలా వినియోగించాలి, ఆప్కాస్ పైన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసే యోచనపై క్యాబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఋషికొండ ప్యాలెస్‌ను వినియోగంలోకి ఎలా తీసుకురావాలి అనే అంశంపై చర్చించాలని తెలిపారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఋషికొండ ప్యాలెస్‌ను సందర్శించి అభిప్రాయలు చెప్పాలని మంత్రులతో ముఖ్యమంత్రి అన్నారు.

# అందుకే రెడ్ బుక్ పేరెత్తాను

-మొదటిపేజీ తరువాయి

లోకేశ్ స్పష్టంచేశారు. మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో నిరుపేద కుటుంబానికి శాశ్వత పట్టా అందించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుచేసిందని, తాము అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. తాము ప్రతిపక్ష నేత ఇంటి గేటుకు తాళ్లు కట్టలేదని, తప్పుడు కేసులు బనాయించడం లేదని వ్యాఖ్యానించారు.

### తప్పుడు ప్రచారం చేస్తున్నందుకే రెడ్ బుక్ పేరు చెప్పా

కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో 35 వేల మంది ప్రజలు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు పొట్టచేతబట్టుకొని వలసలు వెళ్లారు. యువగళం పాదయాత్ర సమయంలో అక్కడ వలసలను నివారిస్తానని హామీ ఇచ్చా. ఆ మాటమేరకు కనిగిరిలో తొలి రిలయన్స్ సీబీజీ ప్లాంటు ఏర్పాటుచేశాం. అక్కడ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి 50 వేల ఎకరాల భూములు ఇచ్చేందుకు తమ రైతులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. దానిపై రిలయన్స్ డైరక్టర్ స్పందించి 50 ప్లాంట్లు అక్కడే ఏర్పాటుచేస్తామని అన్నారు. కరవు ప్రాంతంలో పెద్దఎత్తున యువతకు ఉపాధి కల్పించేందుకు ఇటువంటి ప్రాజెక్టులు తెస్తుంటే వైసీపీ వారికి కడుపు మంట దేనికి? బొబ్బలు వస్తాయంటూ దానిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆ దుష్ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టేందుకే అటువంటి వారిని రెడ్ బుక్ లోకి ఎక్కిస్తానని చెప్పా. జగన్ కు సొంతవాళ్లను కలిసేందుకే తీరికలేదు సొంత చెల్లి, తల్లికి న్యాయం చేయలేని వారు మాకు చెబుతారా? ప్రిజనరీ ఆలోచనలన్నీ జైలువైపే ఉంటాయి. తప్పుచేశారు కనుక ఆయన ధైర్యంగా ప్రజల్లో తిరగలేకపోతున్నాడు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కంటే ఎక్కువ సెక్యూరిటీ జగన్ కు కల్పించాం. అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఎవరినీ కలవలేదు, ప్రతిపక్షంలోకి వెళ్ళిన తరువాత కూడా కనీసం కార్యకర్తలను కలిసే సమయం జగన్



కు లేదు. ప్రజలను కలిసే ఓపిక ఆయనకు ఎక్కడుంది? ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి ఉంటే ఐదేళ్లు ఆయన నివసించే ప్రాంతంలో ప్రజల సమస్యలను ఎందుకు పరిష్కరించలేదు? పైగా ఆయన ఇంటిదారి కోసం పేదోళ్ల ఇళ్లను కూల్చారు. పేదలకు అండగా నిలిచే ప్రజాప్రభుత్వం మాది. మాతో అభి వృద్ధి, సంక్షేమంలో పోటీపడలేక కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో మా ప్రభుత్వం పారదర్శకంగా దర్యాప్తు చ ేస్తోంది. తప్పుచేసిన వారు ఎవరైనా వదిలే ప్రసక్తిలేదని స్పష్టంచేశారు.

### ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు 'పట్టా'భిషేకం

రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఉండవల్లిలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా, 15 సంవత్సరాలుగా కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న రాజమండ్రి గోవిందు కుటుంబానికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి కొత్త బట్టలు పెట్టి శాశ్వత పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పేదలకు 'పట్టా'భిషేకం చేస్తున్నామని, ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అటవీ, దేవాదాయ, రైల్వే, ఇరిగేషన్ భూముల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల కష్టాలను చూశానని, వారికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించానని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు మూడు విడతలుగా శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, మొదటి విడతలో 150 గజాల్లోపు ఉంటున్న 3 వేల మందికి పట్టాలు ఇస్తున్నామని, రెండో విడతలో ఎండోమెంట్స్, రైల్వే భూముల్లో నివసించేవారికి, మూడో విడతలో మిగిలిన వారందరికీ పట్టాలు అందజేస్తామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవడానికి గత ఐదేళ్లుగా తన సొంత నిధులతో 26 సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు లోకేశ్ తెలిపారు. ఉచిత తాగునీటి ట్యాంకర్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం, కరోనా సమయంలో ఆక్సిజన్, టెలీ మెడిసిన్ సేవలు, ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథాలు, యువత కోసం క్రీడా పోటీలు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలు తనపై నమ్మకంతో 91 వేల భారీ మెజారిటీతో గెలిపించారని, ఇది తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. మంగళగిరిలో 50 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం ద్వారా పార్కులు, రైతు బజార్లు అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పైప్ లైన్ ద్వారా గ్యాస్ వంటి ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయని, శ్మశాన వాటికలు అభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. త్వరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, చేనేతలకు కామన్ ఫెసిలిటీ సెంటర్, స్వర్ణకారులకు జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంగళగిరిని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# విజయనగరంలో వైసీపీ ఖాళీ?



**విజయనగరం :** ఉమ్మడి విజయనగరం జిల్లాలో టీడీపీ మరింత పుంజుకుంటోందా? అంటే అవుననే తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలలోపు వైసీపీ పూర్తిగా ఖాళీ కాబోతుందా? అంటే కూడా అవుననే సమాధానం వినిపిస్తోంది.కురుపాం నుంచి ఎస్ కోట నియోజకవర్గం వరకూ ఎక్కడ చూసినా రాజకీయ వలసలు షరా మాములుగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డానికి కష్టించి పని చేసిన హార్డ్ కోర్ ఫ్యాన్ పార్టీ ఫ్యాన్స్ కూడా ఇప్పుడు సైకిల్ బెల్లు కొట్టడానికి రెడీ అంటే రెడీ అంటున్నారట.ఒక్కో ఏరియాలో ఫలానా కావాలన్న షరతులు పెట్టకుండానే ఫ్యాన్ వదిలి సైకిలెక్కుతున్నారట. దీనంతటికీ కారణమేంటని చూస్తే.. అందరి నుంచి దాదాపు ఒకటే మాట వినిపిస్తోందట. ఇన్నాళ్ల పాటు రెక్కలు ముక్కలు చేసుకుని పార్టీని అధికారంలోకి తెస్తే.. తమకు మిగిలింది ఏదీ లేదని వీరంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఆ మాటకొస్తే ఫ్యాను రెక్కలు ముక్కలయ్యాయి.. మీ కంటికి కనిపించడం లేదా అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారట. ఇన్నాళ్ల పాటు జగన్ని నమ్ముకున్నందుకు తాము నట్టేట మునిగామనీ అంటున్నారట. ఆ పార్టీలాగే తమ జీవితాలు కూడా అలాగే ఛిన్నాభిన్నమై పోయిందనీ వీరంతా గుర్రుగా ఉన్నారట. దీంతో టీడీపీ, జనసేనకు జై కొడుతున్నారట.మరీ ముఖ్యంగా పార్వతీపురం, బొబ్బిలి మున్సిపాల్టీల్లో అయితే అవిశ్వాసానికి సైతం సిద్ధమయ్యారంటే ఫ్యాను పార్టీ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చని అంటున్నారు. బొబ్బిలి మున్సిపాల్టీలో ఇప్పటికే ఒక తిరుగుబాటు మొదలైందట. అవిశ్వాస తీర్మానం పెట్టడమే ఆలస్యమట.స్వయంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఫోన్ చేసి బుజ్జగించినా కుదరదని తెగేసి చెబుతున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. గతంలో ఒక పార్టీ నుంచి మరొక పార్టీలో చేరాలంటే ఆయా ప్రాంతాల్లో పట్టున్న నాయకులతో రాయబారం నడిపించాలి. అదే ఇప్పుడు ఇందుకు రివర్స్ లో ఉందట వ్యవహారం. ఎవరూ ఏమీ అడక్కుండానే.. మేమే వచ్చేస్తున్నాం.. వద్దనకండి ప్లీజ్ అంటూ సైకిల్ బెల్ వారంతట వారే మోగిస్తున్నారట. చోటా మోటా నాయక గణం తమంత తాముగా వెళ్లి.. కూటమి పార్టీల కండువాలు కప్పేసుకుంటున్నారట.ఇక నెల్లిమర్ల నియోజకవర్గంలో అయితే వైసీపీని ఎప్పుడు ఖాళీ చేద్దామా? అన్నట్టుందట ఇక్కడి జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి జోరు. వారానికి కనీసం రెండు మూడు గ్రామాల వైసీపీ కార్యకర్తలను తమ గ్లాసు పార్టీలో చేర్పించందే నిద్రపోవడం లేదట ఎమ్మెల్యే మాధవి. భవిష్యత్తులో తమకు పదవులు వచ్చినా రాకపోయినా.. వైసీపీ అనేది ఉండకూడదు. ఎటు నుంచి ఎటు చూసినా జనసేన మాత్రమే కనిపించాలన్నంత కసితో పని చేస్తున్నారట ఈ మహిళా ఎమ్మెల్యే.అయితే జిల్లా కేంద్రంలో పరిస్థితి కాస్త భిన్నంగా ఉందంటున్నారు. కోరి వస్తామన్నా చేద్దాం- చూద్దాం అంటూ దాట వేస్తున్నారట ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు. వైసీపీలో అవినీతి మరక అంటని వారిని మాత్రమే తీసుకుంటున్నారట. ఇప్పటికే వైసీపీకి చెందిన కార్పొరేటర్లు వస్తామనీ.. కార్పొరేషన్ను టీడీపీ పరం చేస్తామని బంపరాఫర్లు ప్రకటిస్తున్నా.. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు వద్దంటే వద్దంటున్నారట. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎవరికి అధికారం ఇస్తే.. వారే పరిపాలించాలని హితబోధ చేస్తున్నారట. అందులోనూ ఎవరిని పడితే వారిని పార్టీలోకి తీసుకుంటే నష్టం తమకేనని.. వారిస్తున్నారట. దీంతో తండ్రి మాట జవదాటలేక మున్సిపల్ ఎన్నికలు వచ్చే వరకూ వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నారటు ఎమ్మెల్యే.ఇక ఎస్ కోట, చీపురుపల్లి, సాలూరు, గజపతినగరం, కురుపాం నియోజకవర్గాలలో చేరికల పరంపర ఒక రేంజిలో కొనసాగుతోందట. రోజుకో నియోజకవర్గంలో భారీ స్థాయిలో చేరికలు కనిపిస్తున్నాయట. గ్రామాలకు గ్రామాలు సైకిల్ కి సై అంటున్నాయట. దీంతో వైసీపీ లీడర్లు బయటకు రావడానికే తటపటాయించాల్సి వస్తోందట. పార్టీ ఖాళీ అవుతుంటే ఇటు చూస్తూ ఊరుకోలేక, అటు అధినేతకు చెప్పుకోలేక అవస్థలు పడుతున్నారట. ఏది ఏమైనా.. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు వచ్చే నాటికి ఈ ప్రాంతాల్లో వైసీపీ దాదాపు ఖాళీ అయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయట.

## 7 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

-మొదటిపేజీ తరువాయి

అని హాస్పిటల్స్ అసోసియేషన్ తెలిపింది. వైద్యసేవలు అందించలేని పరిస్థితి నెలకొందని మార్చి 7న నోటీసు పంపించాం. నోటీసు పంపించిన తర్వాత రూ.350 కోట్లు మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. మేం ఎప్పుడు డబ్బులు అడిగినా పాత బకాయిలు చెల్లించామనే చెబుతున్నారు. కానీ ప్రభుత్వం చెల్లించే దానికంటే మేం ఎక్కువగానే సేవలు అందిస్తున్నాం. తొంభై శాతం ప్రజలకు ఎన్టీఆర్ వైద్య సేవ కింద 3300 ప్యాకేజీలకు సేవలు అందిస్తున్నాం. ప్రతీ నెలా బకాయిలు పేరుకుపోవడంతో ఆసుపత్రుల మనుగడే కష్టంగా మారింది. మాకు ఉన్న బకాయిల్లో రూ.1500 కోట్లు అత్యవసరంగా చెల్లించాలి. అలా చెల్లించలేని పక్షంలో మా సర్వీసులను మొదలు పెట్టే పరిస్థితి లేదు. కొత్త ఇన్స్యూరెన్స్ స్కీమ్‌కు వెళ్లేముందు ప్రభుత్వం మా బకాయిలన్నీ చెల్లించాలి" అని అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు.

## ఏపీలో ఏఐ అభివృద్ధికి గల అవకాశాలను అన్వేషించాలి

-మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏఐ అభివృద్ధికి కేంద్రంగా మార్చేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. "మీరు చెప్పింది అక్షరాలా నిజం! భారతదేశం తన ప్రయాణాన్ని ఇప్పుడే ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ ఏఐ ఆధారిత అభివృద్ధికి కేంద్రంగా మారడానికి సిద్ధంగా ఉంది. మీ తదుపరి భారత పర్యటనలో మిమ్మల్ని అమరావతికి ఆహ్వానించడం నాకు సంతోషంగా ఉంది. భవిష్యత్తును రూపొందించడంలో మా విజన్‌ను మీతో పంచుకుంటాను" అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రం ఏఐతో పాటు క్వాంటం టెక్నాలజీలో కూడా ముందంజలో ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంకేతిక రంగంలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉందని, ఓపెన్ ఏఐతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉందని తెలిపారు.

## జగన్‌లో ఎంత మార్పో....

**విజయవాడ :** అధికారంలో ఉన్నప్పుడు జగన్ కార్యకర్తల్ని, స్థానిక నేతల్ని పెద్దగా పట్టించుకోలేదనే ఆరోపణ ఉంది. దానికి ఆయన ప్రవర్తనే ప్రత్యక్ష సాక్ష్యం. లోకల్ లీడర్స్ తో పెద్దగా కలిసేవారు కాదు జగన్, ఆ మాటకొస్తే మంత్రులకు కూడా అపాయింట్ మెంట్లు దక్కేవి కావు, ఇక ఎమ్మెల్యేల సంగతి సరేసరి. జగన్ అపాయింట్ మెంట్ దొరకాలంటే ఎమ్మెల్యేలు రోజుల తరబడి తాడేపల్లి ప్యాలెస్ ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు జగన్ అధికారం కోల్పోయాక పరిస్థితిలో మెల్ల మెల్లగా మార్పులొస్తున్నాయి. జగన్ కోటరీ ఒక్కొక్కరే దూరం జరిగారు. అధికారంలో ఉన్నప్పుడు గొంతు చించుకున్నవారు కూడా సైలెంట్ అయ్యారు. చివరకు మిగిలింది కార్యకర్తలు, స్థానిక నాయకులే. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పార్టీకి లాయల్ గా ఉన్నవారు వైసీపీ పరువు కాపాడారు. అందుకే వారికి రేపు తాడేపల్లిలో ప్రత్యేకంగా అపాయింట్ మెంట్ ఇచ్చారు జగన్.రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎంపీపీ, జడ్పీ ఉప ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవాన్ని తప్పించుకుంది. గతంలో ఆయా సీట్లన్నీ వైసీపీకి చెందినవే. అయితే వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా, వైసీపీకి కాస్త అనుకూలంగా ఫలితాలొచ్చాయి. దీంతో జగన్ కి తత్వం బోధపడింది. తాను ఇన్నాళ్లూ దూరం పెట్టిన కార్యకర్తలు, స్థానిక నేతలే తనను వదిలిపెట్టలేదని అర్థమైంది. అధికారంలో ఉన్నప్పుడు తన చుట్టూ కోటరీగా తిరిగిన వాళ్లు, రాజ్యసభ స్థానాలు, ఎమ్మెల్సీలు తీసుకున్నవారు అడ్రస్ లేకుండా పోయారనే విషయం స్పష్టమైంది. దీంతో జగన్ లో మార్పు మొదలైంది. కార్యకర్తలకు హ్యాట్సాఫ్ అంటూ ఆమధ్య ట్వీట్ వేసిన ఆయన, తాజాగా స్థానిక నాయకులతో ప్రత్యేకంగా మీటింగ్ పెట్టారు. పార్టీ విజయానికి సహకరించిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలను స్వయంగా కలుస్తానని కబురు పంపించారు జగన్. వారందర్నీ తాడేపల్లికి పిలిపిస్తున్నారు.వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగే సమావేశానికి అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాలకు సంబంధించి 8 నియోజకవర్గాల్లోని వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు హాజరవుతారు. వీరందరికీ జగన్ ప్రత్యేకంగా సమయం కేటాయిస్తారట. అందరితో మాట్లాడి, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అడిగి తెలుసుకుంటారట. ఈ మార్పు సరిపోదు జగనూ..

జగన్ లో మార్పు మొదలవడం మంచిదే, కానీ ఈ మార్పు సరిపోదు. అప్పట్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ని పొరుగు రాష్ట్రం నేతలంటూ ఎగతాళి చేసిన జగన్.. అధికారం పోయాక తాను బెంగళూరులో ఎందుకు తలదాచుకుంటున్నారో చెప్పాల్సి ఉంది. కానీ జగన్ ఇప్పుడు అసలైన పొలిటికల్ టూరిస్ట్ లా మారిపోయారని సోషల్ మీడియాలో కౌంటర్లు పడుతున్నాయి. ఎప్పుడో ఎక్కడో రాష్ట్రంలో ఎవరైనా చనిపోతే మాత్రం పరామర్శలకు వస్తున్నారనే ఆరోపణ కూడా ఉంది. కానీ ఈసారి లోకల్ లీడర్స్ కోసం బెంగళూరు నుంచి జగన్ వస్తున్నారు. ఇది మెచ్చుకోవాల్సిన విషయమే. కానీ ఈ మార్పు సరిపోదు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన కళ్లకు గంతలు కట్టి ఆడించింది కోటరీయేనని ఆ పార్టీ నేతలు కొందరు బలంగా నమ్ముతున్నారు. ఆ గంతలు ఆయన విప్పుకోవాలి. ప్రజల మధ్యకు వచ్చినప్పుడే ఏదైనా ఫలితం ఉంటుంది. అది కూడా కూటమి చేసే తప్పుల్ని బట్టే ప్రజలు జగన్ దగ్గరకు చేరతారనే విషయాన్ని మరింతగా అర్థం చేసుకోవాలి. పాలనలో కూటమి సక్సెస్ అయితే నాలుగేళ్ల తర్వాత కూడా ప్రజలకు జగన్ అవసరం ఉండదు.

## సోషల్ మీడియాలో ప్రచారానికి హద్దే లేదా

**రాజమండ్రి :** నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టుంది ప్రస్తుత రాజకీయాలు. సోషల్ మీడియా జనరేషన్‌లో పాలిటిక్స్ మరింత దారుణంగా ఉంటున్నాయి. పాస్టర్ ప్రవీణ్ పగడాల డెత్ కేసులో ఎంత రచ్చ జరిగిందో అంతా చూస్తున్నారు. సీసీఫుటేజ్‌లో చిన్న అనుమానం కూడా లేదు. ప్రవీణ్ ఒంటిపై దాడి జరిగిన ఆనవాళ్లు కూడా లేవు. కత్తి పోట్లు, దెబ్బలు, విష ప్రయోగం.. గట్రా ఎలాంటి డౌట్ లేదు. కానీ, చంపేశారు.. చంపేశారు.. అంటూ సోషల్ మీడియాలో విష ప్రచారం చేశారు. సొసైటీలో మత చిచ్చు రగిల్చే ప్రయత్నం చేశారు కొందరు.ఈ తరహా ప్రచారం వెనుక ఓ పార్టీ ప్రోద్బలం ఉందనే ఆరోపణ ఉంది. ఆ పార్టీ అనుకూల వర్గీయుల నుంచే ఎక్కువగా రెచ్చగొట్టే పోస్టులు, కామెంట్లు వచ్చాయని పోలీసులు గుర్తించారు. వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకూ సిద్ధమవుతున్నారు.చనిపోయింది పాస్టర్ కాబట్టి.. ఎలా చనిపోయారో తెలీటం లేదు కాబట్టి.. చంపేశారు అంటే సరిపోతుందా? సున్నితమైన అంశం కావడం తమకు కలిసి వస్తుందని అనుకుంటున్నారా? కూటమి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసేందుకు ఇంతలా రెచ్చగొట్టాలా? మతం రంగు పులిమేసి.. జనాల్లో విద్వేషాన్ని రగిలిచ్చి ఏం చేయాలనుకున్నారు? ఆ వేడిలో రాజకీయ పబ్బం గడుపుకునే వ్యూహం పన్నారా? మరీ, ఇంతటి ప్రమాదకరమైన క్రీడ ఆడటం కరెక్టేనా?హైదరాబాద్ నుంచి కొవ్వూరు వరకు.. దారి పొడవునా గంటల తరబడి సీసీకెమెరా ఫుటేజ్ దొరికింది కాబట్టి సరిపోయింది. లేదంటే పోలీసులు చెప్పిన విషయాల్ని అంత ఈజీగా ఎవరైనా నమ్మేవాళ్లా? పాస్టర్ ప్రవీణ్ పగడాల విజయవాడ చేరుకోవడం.. అక్కడ పార్కులో సేద తీరడం.. అప్పటికే ఆయన బుల్లెట్ బండి హెడ్‌లైట్ పగిలిపోయి ఉండటం.. చాలా నీరసించి ఉండటం.. ఆ తర్వాత దారి మధ్యలో లిక్కర్ కొనడం.. ఇలా మినిట్ టు మినిట్ కంప్లీట్ సీసీఫుటేజ్ బయటపెట్టారు ఏపీ పోలీసులు. అవన్నీ చూశాక కానీ.. ప్రవీణ్‌ది హత్య కాకపోవచ్చు.. యాక్సిడెంటో, అస్వస్థత వల్లో చనిపోయి ఉండొచ్చు అని ప్రజలు ఇప్పుడిప్పుడే ఓ అంచనాకు వస్తున్నారు. ఒకవేళ ఆ సీసీకెమెరా దృశ్యాలు లభించి ఉండకపోయి ఉంటే..? ప్రవీణ్‌ను చంపేశారని ప్రజలకు ఫిక్స్ చేసేవారే కదా? సోషల్ మీడియా రచ్చ ఇప్పట్లో ఆగి ఉండేదా? క్రిష్టియన్లకు మిగతా వర్గాలకు మధ్య చిచ్చు పెడితే.. రాష్ట్రం మతాల వారిగా విడిపోతే.. అది అందరికీ నష్టమే కానీ ఎవరికీ లాభం కాదు. చివరికి ఆ పార్టీకి కూడా. అందరికీ అన్ని వర్గాల మద్దతు కావాల్సిందేగా. ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్ అయ్యారు?ఇప్పుడే కాదు గతంలోనూ ఇలాంటి డైవర్ట్ పాలిటిక్స్ చూశాం. వివేకానందరెడ్డిని గొడ్డలితో అతి దారుణంగా తల నరికి చంపారు. ఆయన డెడ్‌బాడీ రక్తపు మడుగులో పడి ఉంది. ఆ స్పాట్ చూస్తే చిన్నపిల్లాడైనా చెప్పేస్తాడు అది హత్య అని. కానీ, గుండెపోటు అని ప్రకటించి చావు తెలివితేటలు చూపించారు కొందరు. నిజం బయటకు రాకుండా సమాధి చేయలేక పోయారు. ఆ కేసుతో సంబంధం ఉన్న వాళ్లంతా ఇటీవల వరుసగా చనిపోతుండటం.. హత్యా రాజకీయాలు ఇంకా ఆపలేదనే అనుమానాన్ని బలపరుస్తోంది. వివేక కేసులో హత్యను గుండెపోటుగా చిత్రీకరిస్తే.. పాస్టర్ ప్రవీణ్ పగడాల లాంటి సెన్సిటివ్ కేసులో మర్డర్ ముసుగు వేసే ప్రయత్నం పక్కా ప్లాన్డ్‌గా జరిగిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# పరిటాల రవి హత్యలో జగన్ కు సంబంధం ఉంది

- కారు బాంబు, టీవీ బాంబు, 45హత్యలకు సమాధానం చెప్పి జిల్లాలో అడుగు పెట్టు
- చంద్రబాబు లోకేష్ పై చేసిన వ్యాఖ్యలకు తోపుదుర్తి చందును తుక్కుతుక్కుగా కొట్టాలి
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంచలన వ్యాఖ్యలు
- గంగుల, సానే కుటుంబాలను మళ్లీ ఫ్యాక్షన్ ఊబిలోకి లాగుతున్నారు
- పాపంపేటలో ఇళ్ల కూల్చివేతలో 8 కోట్లు తీసుకున్నట్టు నిరూపించాలని సవాల్
- తోపుదుర్తి బ్రదర్స్, జగన్ రెడ్డి పై నిప్పులు జరిగిన పరిటాల సునీత





**అంకుశం ప్రతినిధి అనంతపురం ఏప్రిల్ 3:** మాజీ మంత్రి పరిటాల రవీంద్ర హత్య వెనుక వైసీపీ అధినేత జగన్ రెడ్డి హస్తం ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంచలన వ్యాఖ్యలు చేశారు. సిబిఐ కూడా ఈ కేసులో జగన్ని విచారించిందని ఆమె అన్నారు. రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి సంఘటన నేపథ్యంలో జగన్ జిల్లాకు వస్తుండటంపై ఆమె తీవ్రంగా స్పందించారు. అలాగే గత కొన్ని రోజులుగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోదరులు చేస్తున్న వ్యాఖ్యల మీద ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. గత కొన్ని రోజులుగా నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు అన్నింటిని ఆమె వివరించారు. అసలు విషయాన్ని పక్కదోవ పట్టిస్తూ కుల, శవ రాజకీయాలు చేస్తున్న వైనం గురించి పరిటాల సునీత అనంతపురంలో విలేకరుల సమావేశంలో అనేక విషయాలు వెల్లడించారు. చేతనైతే 8కోట్లు నేను తీసుకున్నట్టు నిరూపించు ప్రకాష్ రెడ్డి అనంతపురం రూరల్ మండల పరిధిలోని పాపంపేటలో ఇటీవల ఇళ్లు కూల్చివేత సంఘటనలో పరిటాల కుటుంబం హస్తం ఉందంటూ ప్రకాష్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యల మీద పరిటాల సునీత తీవ్రంగా స్పందించారు. పాపంపేట సర్వే నెంబర్ 106, 1వ లెటర్ లో 63 సెంట్ల స్థలం విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కలెక్టర్ రెవెన్యూ అధికారులు ముందుకెళ్లారన్నారు. ఇందులో ఎక్కడా రాజకీయ నాయకుల ప్రమేయం లేదన్నారు. కేవలం సుప్రీంకోర్టు ఆదేశాలను మాత్రమే రెవెన్యూ అధికారులు అమలు చేశారన్నారు. మొదట ఇళ్ళ కూల్చివేతను అడ్డుకునేందుకు మా పార్టీ నాయకులు కూడా చాలా ప్రయత్నాలు చేశారన్నారు. కానీ ఆ సమయంలో ప్రకాష్ రెడ్డి ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. మూడు రోజుల తర్వాత ఈ సంఘటనను రాజకీయం చేస్తూ.. తమ మీద దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తాను 8 కోట్లు తీసుకొని. ఇందులో భవనాలు కట్టాలని చూస్తున్నారన్న ఆరోపణల మీద కూడా ఆమె ఘాటుగా స్పందించారు. తాను 8 కోట్లు తీసుకున్నట్టు చేతనైతే నిరూపించాలని సవాల్ విసిరారు. జెసిబి లు వస్తున్నాయంటే భయపడేది మా రాప్తాడు నియోజకవర్గ ప్రజలు కాదని.. తోపుదుర్తి సోదరులు మాత్రమేనన్నారు. నేను కూల్చాలి అనుకుంటే మీ హైదరాబాదులో ఉన్న బంగ్లాలను కూలుస్తానని హెచ్చరించారు. మాకు ఇల్లు లేదు అద్దె ఇంట్లో ఉన్నామంటూ దొంగ ఏడుపులు ఏడ్చే ప్రకాష్ రెడ్డి సోదరులకు హైదరాబాదులో భవనాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. జెసిబిల శబ్దం వస్తే ముందు భయపడేది మీరేనని సునీత అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా అధికారంలో లేనప్పుడు ఇంకోలా వ్యవహరించే పద్ధతి మాది కాదని సునీత అన్నారు. పరిటాల కుటుంబం ఇచ్చే కుటుంబమే తప్ప తీసుకునే కుటుంబం కాదని ఆమె స్పష్టం చేశారు...

### కారు బాంబు, సూట్ కేస్ బాంబు, 45 హత్యలకు జగన్ సమాధానం చెప్పి రావాలి

తోపు సోదరులు ఎప్పుడు మాట్లాడిన టీవీ బాంబు గురించి ప్రస్తావిస్తుంటారని.. అయితే వారు కారు బాంబు గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. కారు బాంబు ఘటనలో 24 మందిని పొట్టన పెట్టుకున్నారని,. ఇందులో జర్నలిస్టులు కూడా ఉన్నారని ఆమె గుర్తు చేశారు.. ఈ సంఘటనలో తోపు సోదరులు జైలుకు కూడా వెళ్లి వచ్చారని అన్నారు. మంగళవారం వస్తానంటున్న జగన్ రెడ్డికి శుక్రవారం బాగా అచ్చి వస్తుందని.. ఆ వచ్చేటప్పుడు ఆయన కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పి రావాలని డిమాండ్ చేశారు. జగన్ రెడ్డికి సూట్ కేసు బాంబు గురించి కూడా బాగా తెలుసునని ఆయన అప్పట్లోనే పరిటాల రవిని హత్య చేసేందుకు ప్రయత్నించారన్నారు. పరిటాల రవీంద్ర హత్య వెనుక జగన్ హస్తం ఉందన్నారు. అప్పట్లోనే సిబిఐ వారు కూడా అతన్ని విచారించిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలో 45 మందిని పొట్టన పెట్టుకున్న చరిత్ర మీకు ఉందన్నారు. కారు బాంబు, సూట్ కేస్ బాంబుతో పాటు 45 మందిని చంపిన వాటికి సమాధానం చెప్పి జగన్ జిల్లాలోకి రావాలన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కక్షలు రేపేందుకు జగన్ వస్తున్నారా అని ప్రశ్నించారు. మా ప్రాంతం ప్రశాంతంగా ఉందని అలా ఉండటం మీకు ఇష్టం లేదా అని సునీత నిలదీశారు...

### పరిటాల, గంగుల, సానే కుటుంబాలు చాలా కోల్పోయాయి

తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోదరులు ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో మళ్లీ కక్షలు రేపాలని చూస్తున్నారన్నారని సునీత అన్నారు. వారు అధికారంలో ఉంటే ఒకలా ఉంటారని.. అధికారం లేకుంటే ఇలాంటి కక్షలు రేపడం అలవాటుగా మారిందన్నారు. మద్దలచెరువు గ్రామానికి చెందిన గంగుల కుటుంబాన్ని, కనుముక్కల గ్రామానికి చెందిన సానే కుటుంబాన్ని మధ్యలోకి లాగుతున్నారన్నారు. మా కుటుంబంతోపాటు ఆ రెండు కుటుంబాలు కూడా ఫ్యాక్షన్ వల్ల ఎంతో కోల్పోయాయన్నారు. నా కుటుంబంలో నా భర్తతో పాటు మామ, మరిదిని కూడా కోల్పోయామని గుర్తు చేశారు. అలాగే సానే కుటుంబంలో వారి తండ్రి, సోదరులను కోల్పోయి ఉమ ఒంటరిగా మారారన్నారు. గంగుల కుటుంబంలో కూడా భానుమతి ఒంటరిగా మిగిలారన్నారు. ఇలా ఫ్యాక్షన్ వల్ల కుటుంబ సభ్యుల్ని కోల్పోయి పిల్లల్ని పోషించడానికి, చదివించడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. ఒక పూట తిని తినక నాలుగు గోడల మధ్య ఏడ్చుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయని... ఇవన్నీ తోపుదుర్తి సోదరులకు తెలుసా అని ప్రశ్నించారు. మీ కుటుంబంలో ఎవరినైనా కోల్పోతే ఇలాంటి బాధలు ఎలా ఉంటాయో తెలుస్తాయని సునీత అన్నారు. అంతా ప్రశాంతంగా ఉన్న సమయంలో మళ్లీ గంగుల, సానే కుటుంబాలను మధ్యలోకి లాగుతున్నారని... ప్రకాష్ రెడ్డి సోదరులు పన్నుతున్న ఈ కుట్రలో బలి కావద్దని ఆమె ఆ రెండు కుటుంబాలకు విజ్ఞప్తి చేశారు. వారు చలిమంట వేసుకొని ఆనందం పొందే వ్యక్తులని ప్రకాష్ రెడ్డి సోదరులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంగుల సానే కుటుంబాల మీద మీకు అంత ప్రేమ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు వారికి ఎందుకు న్యాయం చేయలేదన్నారు. కనీసం ఎమ్మెల్సీ ఇవ్వడం లేదా ఏదైనా ఒక మంచి పదవి ఎందుకు ఇప్పించలేకపోయారన్నారు.

### రెడ్డి సామాజిక వర్గం పరిటాల కుటుంబంతోనే ఉంది

పరిటాల కుటుంబం మొదటి నుంచి రెడ్డి సామాజిక వర్గంతో సఖ్యతగా ఉందని పరిటాల సునీత స్పష్టం చేశారు. కానీ రెడ్డి సామాజిక వర్గానికి పరిటాల కుటుంబం వ్యతిరేకం అన్నట్టుగా తోపు సోదరులు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పరిటాల రవి హయాంలో కూడా రెడ్డి కులస్తులతో మేము సంబంధాలు కలుపుకోవాలనుకున్న విషయం అందరికీ తెలుసునన్నారు. రెడ్డి సోదరులతో మా కుటుంబానికి ఎప్పుడు విభేదాలు లేవన్నారు. 2019 ఎన్నికల ముందు మీ గెలుపు కోసం రెడ్డి సోదరులు సొంత ఆస్తులమ్మి పనిచేసారని.. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని ఎన్ని ఇబ్బందులకు గురిచేశారో రాప్తాడు నియోజకవర్గం మొత్తానికి తెలుసు అన్నారు. అందుకే వారు మీకు దూరమయ్యారని.. ఇప్పుడు వారిని మళ్లీ దగ్గర చేసుకునేందుకు పరిటాల కుటుంబాన్ని వాడుకుంటున్నారని సునీత మండిపడ్డారు. తోపు సోదరులు చెప్పే ఇలాంటి వాటిని రెడ్డి సోదరులు నమ్మవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. తోపుదుర్తి చందు హైదరాబాద్ నుంచి వచ్చేటప్పుడు కొందరు రెడ్డి కులస్తుల పిల్లలకు ఫోన్ పే ద్వారా డబ్బు పంపి... వారికి మద్యం తాపించి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ఇళ్ల వద్దకు వచ్చి మహిళలను కించపరిచే విధంగా మాట్లాడితే ఏవైనా గొడవలు జరిగినా లేదా పోలీస్ కేసులు పెట్టినా ఇవన్నీ పరిటాల కుటుంబం చేయిస్తోందని.. తోపు సోదరులు ప్రచారం చేస్తారన్నారు

### చంద్రబాబు, లోకేష్ పై చేసిన వ్యాఖ్యలకు నిన్ను తుక్కుతుక్కుగా కొట్టాలి

తోపుదుర్తి చందు పై ఎమ్మెల్యే సునీత విరుచుకుపడ్డారు. వైసిపి అధికారంలో ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పై ఇష్టం వచ్చినట్లు తిట్టిన వీడియోలను ఆమె మీడియాకు చూపించారు. ఆరోజు చెప్పరాని భాషలో తిట్టడమే కాకుండా నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్న సమయంలో మొద్దు శీను బ్రతికి ఉంటే నువ్వు పాదయాత్ర చేసే వాడివా అంటూ మాట్లాడిన మాటలు ఆమె అందరికీ సెల్ ఫోన్ లో చూపించారు. అధికారం ఉన్నప్పుడు ఇలా ఇష్టం వచ్చినట్లు మాట్లాడి.. ఇప్పుడు చంద్రబాబు గారు లోకేష్ గారు అంటూ మర్యాద ప్రదర్శిస్తున్నారన్నారు. నీ మీద కేసులు పెట్టే ఉద్దేశం ఉండి ఉంటే తుక్కుతుక్కుగా కొట్టి లోపల వేయించేవారమన్నారు. కానీ మా ముఖ్యమంత్రి చంద్రబాబు అలాంటివి ప్రోత్సహించడం లేదన్నారు. ఎన్నికల సమయంలోనూ లేదా ఇతర సమయాల్లో జరిగే గొడవలను పట్టించుకోవద్దని.. మనం ప్రజల కోసం పనిచేయాలని చెబుతున్నారన్నారు. అదే సైకో జగన్ రెడ్డి ప్రభుత్వంలో మాలో ఎవరైనా ఇలాంటి మాటలు మాట్లాడి ఉంటే..మీరు ఏం చేశారో అందరికీ తెలుసునన్నారు. చిన్న చిన్న వీడియోలు పెట్టిన దానికే స్టేషన్లకు పిలిపించి, కొట్టించి, కేసులు పెట్టించిన చరిత్ర మీదని సునీత అన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలాంటివి ప్రోత్సహించడం లేదన్నారు.

ఎంపీపీ ఎన్నిక గెలవడం మాకు పెద్ద సమస్య కాదు

రామగిరి ఎంపీపీ స్థానాన్ని మేము కావాలనుకుంటే ఆపే శక్తి మీ వద్ద లేదని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఇక్కడ మొత్తం 09మంది సభ్యులు ఉంటే 8మంది వైసీపీ వారున్నారని ఒకరు మాత్రమే తెలుగుదేశం పార్టీ వారు ఉన్నారని...అది కూడా మహిళలకు రిజర్వ్ అయిన స్థానం అని గుర్తు చేశారు.


### పాపిరెడ్డిపల్లి సంఘటన అనుకోకుండా జరిగింది

ఎంపీపీ ఎన్నిక గెలవలేదన్న అక్కసుతో... ప్రకాష్ రెడ్డి ప్రతిదీ రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగాది పండుగ రోజు పాపిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన సంఘటన అనుకోకుండా జరిగింది తప్ప ఉద్దేశపూర్వకంగా చేసింది కాదన్నారు. ఈ సంఘటనలో లింగమయ్య చనిపోవడం చాలా బాధాకరమన్నారు. ఇది మా కుటుంబాన్ని ఎంతో బాధించిందన్నారు. పండుగ రోజు చిన్న విషయంలో జరిగిన గొడవ కారణంగానే లింగమయ్య చనిపోయారన్నారు

చివరగా ఒక గ్రామంలో జరిగిన సంఘటన ఫ్యాక్షన్ గా చిత్రీకరించి... జగన్ రెడ్డి వస్తున్నారని అయితే ఆయన వచ్చే ముందు కారు బాంబు, సూట్ కేస్ బాంబులు, ఆయన తండ్రి హయాంలో జరిగిన హత్యలకు సమాధానం చెప్పిన తర్వాతే జిల్లాకి రావాలని పరిటాల సునీత డిమాండ్ చేశారు. ఫ్యాక్షన్ రాజకీయాలు చేసే అంశంపై ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని పరిటాల సునీత అన్నారు....

## చేనేత కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి


25 మంది చేనేత కార్మికులకు సోలార్ యూనిట్లు పంపిణీ



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 03:** కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేస్తున్న స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా మంజూరైన సోలార్ యూనిట్లను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పంపిణీ చేశారు. ఆదివారపుపేటలోని శ్రీ శివ బాలయోగి మహారాజ్ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం గురువారం జరిగింది. చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తుందని, ఈ స్కీం ద్వారా ఇప్పటికే జాకాడ మోటర్లు, మిషన్లు మంత్రి సుభాష్ చే గతంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. సోలార్ యూనిట్లు పంపిణీ ద్వారా విద్యుత్ అంతరాయం ఉన్న సమయంలో కూడా నేత పని చేసుకునేందుకు అవకాశం ఉంటుందని వాసంశెట్టి సత్యం వెల్లడించారు. నేత కార్మికులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధికారులు, కూటమి నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ కోదండరాముని రథోత్సవం





**అంకుశం ప్రతినిధి తిరుపతి ఏప్రిల్ 3:** తిరుపతి శ్రీ కోదండరామస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం ఉదయం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 9.15 గంటలకు శ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరాములవారు రథాన్ని అధిష్టించి నాలుగు మాడ వీధుల్లో విహరించారు. డప్పు వాయిద్యాలు, భజన బృందాలు కోలాటాలు ఆడుతుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. రథం నాలుగు మాడ వీధుల్లో ఊరేగి యథాస్థానానికి చేరిన తరువాత ప్రబంధం, వేద శాత్తుమొర నిర్వహించి హారతి ఇచ్చారు. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూల శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వ జ్ఞానమిదే. మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4 గంటల వరకు అర్చకులు తిరుమంజనం, ఆస్థానం నిర్వహించనున్నారు. రాత్రి 7 నుండి 8.30 గంటల వరకు అశ్వవాహన సేవ వేడుకగా జరగనుంది. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఏప్రిల్ 4న చక్రస్నానం కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు కపిలతీర్థంలో చక్రస్నానం వైభవంగా జరుగనుంది.

## వైభవంగా నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవాలు !



**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 3:** గత వారం రోజులుగా నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయని. ఈ వేడుకల్లో పాల్గొన్నధర్మవరం చేనేత ప్రముఖులు దాశెట్టి నాగరాజు తెలిపారు. ఈ ఉత్సవాలు సందర్భంగా పోస్టర్ ప్రచారం ధర్మవరం మాధవ్ సిల్క్స్ తరుపున దాశెట్టి నారాయణ స్వామి, కీ. శే. శ్రీ మతి దాశెట్టి ఓబుళమ్మ దంపతుల సహకారం తో నిర్వహించడం జరిగింది. అక్కడ విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాట్లు కూడా ఉన్నాయని అన్నారు. ఈ వేడుకలకు చుట్టు పక్కల ప్రాంతాల నుండి అనేకమంది భక్తులు వచ్చారని అన్నారు.

## 19 లక్షలు విలువ చేసే " ఎల్ఈడి మహీంద్ర బొలేరో వెహికల్ " వాహనం అందువేత

జిల్లా పోలీసుశాఖకు అందజేసిన అదానీ ఫౌండేషన్,
అభినందించిన జిల్లా ఎస్పీ పి జగదీష్






**అంకుశం క్రైమ్ ప్రతినిధి అనంతపురం ఏప్రిల్ 3:** జిల్లాలో జరుగుతున్న నేరాల పట్ల ప్రజల్ని అప్రమత్తం చేయడానికి ఈ వాహనాన్ని "సురక్ష" పేరున జిల్లా వ్యాప్తంగా తిప్పేందుకు కార్యాచరణ ప్రణాళికలు సదరు " సురక్ష " వాహనాన్ని జిల్లా ఎస్పీ పి జగదీష్ ప్రారంభించారు అనంతపురం పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ప్రారంభించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ... సైబర్ నేరాలు( డిజిటల్ అరెస్టు, పార్ట్ టైం జాబ్ ఫ్రాడ్స్, APK ఫైల్ ఫ్రాడ్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ )... రోడ్డు ప్రమాదాలు నియంత్రణ ( హెల్మెట్ / సీట్ బెల్టు ధరించడం, తదితర రోడ్డు భద్రతా నియమాల పాటింపు) ...గంజాయి, మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన చేసే విధంగా సురక్ష వాహనాన్ని సిద్ధం చేశామన్నారు. ప్రొజెక్టర్ ద్వారా వీడియోలు చూయిస్తూ ప్రజల్ని అప్రమత్తం చేయనున్నారుకమ్యునిటీ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి రూ. 19 లక్షల విలువ చేసే " LED డిస్ప్లే మహీంద్ర బొలేరో వెహికల్ " ను అందజేసిన " అదానీ ఫౌండేషన్ తాడిపత్రి" వారిని అభినందించిన లిజిల్లా ఎస్పీ పి.జగదీష్ ... అన్నారు.. అదాని ఫౌండేషన్ సౌత్ - 2 క్లస్టర్ సిఎంఓ అంకుర్ అగర్వాల్, క్లస్టర్ హెచ్ ఆర్ హెడ్ చిత్వాన్ బొహ్రా, తదితరులను అభినందించిన జిల్లా ఎస్పీ ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సైబర్ సెల్ సి.ఐ షేక్ జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎపికి 25లో టి.ఆర్.ఐలకు మంజూరు చేసిన నిధులు విడుదల కాలేదు

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉకే వెల్లడి
గిరిజన పరిశోధనా సంస్థల పై ప్రశ్నించిన ఎంపి కేశినేని శివనాథ్



**అంకుశం ప్రతి నిధిఢిల్లీ ఏప్రిల్ 3:** ఆంధ్రప్రదేశ్ లో గిరిజన పరిశోధనా సంస్థ 2014లో ఏర్పాటు చేయటం జరిగింది. కేంద్ర ప్రాయోజిత పథకం "గిరిజన పరిశోధనా సంస్థలకు మద్దతు (TRIs)" కింద ఆంధ్రప్రదేశ్‌తో సహా గిరిజన పరిశోధనా సంస్థలకు ప్రైమర్ల తయారీకి ఆర్థిక సహాయం అందించబడుతుంది. బహుభాషా విద్య (MLE) పథకం కింద, గిరిజన భాషల్లో ప్రైమర్లు, వర్ణమాల, స్థానిక పద్యాలు, కథలు ప్రచురించ బడుతున్నాయని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ యూకే వెల్లడించారు. రాష్ట్రాల వారీగా గత ఐదేళ్లలో నిర్దిష్ట పథకం కింద మద్దతునిచ్చిన మొత్తం గిరిజన పరిశోధనా సంస్థలకు మంజూరు చేసిన నిధులు, శిక్షణా కార్యక్రమాల ద్వారా లబ్ధిదారుల సంఖ్య, ఇప్పటి వరకు టి.ఆర్.ఐ లకు విడుదల చేసిన మొత్తం ప్రైమర్‌ల సంఖ్య, బోధన కోసం టి.ఆర్.ఐ లకు విడుదల చేసిన ఈ ప్రైమర్‌లను ఉపయోగించే మొత్తం విద్యా సంస్థల సంఖ్యకు సంబంధించి ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం వివరాలపై పార్లమెంట్ సమావేశాల సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ యూకే గురువారం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత పథకం 'గిరిజన పరిశోధనా సంస్థలకు టిఆర్ఐ మద్దతు కింద రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 29 గిరిజన పరిశోధనా సంస్థలకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తుందని తెలిపారు. గత ఐదేళ్లలో ఎపి 2020-21 లో 54.2 కోట్లు మంజూరు చేయగా రూ.45.5 కోట్లు విడుదల చేశారు. 2021-2022 లో రూ.24.5 కోట్లు మంజూరు కాగా రూ.43.2 కోట్లు విడుదల అయ్యాయి. 2022-2023 లో రూ.56.16 కోట్లు మంజూరు కాగా రూ.21.91 కోట్లు విడుదల చేసినట్లు, 2023-2024 లో రూ.108 కోట్లు మంజూరు కాగా రూ.12.50 కోట్లు విడుదల కాగా, 2024-2025 లో రూ.13.40 కోట్లు మంజూరు కాగా ఇప్పటి వరకు నిధులు ఏమి విడుదల కాలేదని పేర్కొన్నారు. ఈ పథకం కింద, మౌలిక అవసరాలు, పరిశోధన డాక్యుమెంటేషన్ కార్యకలాపాలు, శిక్షణ, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు, గిరిజన పండుగల నిర్వహణ, విశిష్ట సాంస్కృతిక వారసత్వం , పర్యాటకం ప్రచారం కోసం యాత్రలు, గిరిజనుల మార్పిడి సందర్శనల నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలు నిర్వహించబడతాయి, తద్వారా వారి సాంస్కృతిక పద్ధతులు, భాషలు ఆచారాలు సంరక్షించబడతాయి. ప్రచారం చేయబడతాయని కేంద్ర మంత్రి బదులిచ్చారు.

# లక్ష్య, ముస్కాన్, కాయకల్ప
# లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలి.





**వైద్య అధికారులు, సిబ్బంది అందరికీ క్వాలిటీ శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి.**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**

**అంకుశం న్యూస్ అనంతపురం, ఏప్రిల్ 03:** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోలక్ష్య, ముస్కాన్, కయకల్ప లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని,జిల్లాలోని వైద్య అధికారులు, సిబ్బంది అందరికీ క్వాలిటీ శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, పేర్కొన్నారు. గురువారం స్థానిక అనంతపురం డి ఎం అండ్ హెచ్ ఓ ఛాంబర్ నందు డిఎంహెచ్ఓ , డిసిహెచ్ఎస్, జి జి హెచ్ అడ్మినిస్ట్రేటర్, ఈఈ ఏపీఎంఎస్ఐడిసి, ఏడి డ్రగ్, జిల్లా నాణ్యత బృందం ,ఆన్లైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏరియా హాస్పిటల్స్ మెడికల్ సూపరింటెండెంట్లు మరియు CHCలు మరియు PHCల మెడికల్ ఆఫీసర్లు తో జిల్లా నాణ్యత హామీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భారతదేశంలోని ఆరోగ్య వ్యవస్థలలో నాణ్యతను నిర్ధారించడం కోసం నేషనల్ క్వాలిటీ ఇన్సూరెన్స్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, జాతీయ ఆరోగ్య మిషన్ యొక్క ఉద్దేశం అందరికీ అందుబాటులో సరసమైన మరియు నాణ్యత మైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడమే లక్ష్యంగా నేషనల్ క్వాలిటీ అన్సూరెన్స్ ప్రోగ్రాంను ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు. NQAP నందు కాయకల్ప, లక్ష్య, స్వచ్ఛ స్వస్త్ సర్వత్ర, మేరా హాస్పిటల్ ఆరోగ్య వ్యవస్థల్లో నాణ్యత ను నిర్ధారించడం, ఆరోగ్య వ్యవస్థల అంతట బెంచ్ మార్కులను రూపొందించడానికి ఉపయోగపడే సూచనలు అందిస్తుందని తెలిపారు. జిల్లాస్థాయి క్వాలిటీ అస్సూరెన్స్ కమిటీ మీటింగ్ ప్రతి మూడు నెలలకు ఒకసారి మొదటి గురువారం నిర్వహించాలని అన్నారు.

NHM HR ఖాళీల జాబితా మరియు జనరల్ సెక్షన్ ఖాళీల జాబితా నివేదికలు తయారు చేయాలని, అలాగే మెడికల్ సూపరింటెండెంట్లు , మెడికల్ ఆఫీసర్లకు NQAS ఓరియంటేషన్ ప్రోగ్రాం నందు వచ్చే శుక్రవారం సాయంత్రం 4 గంటలకు అనంత అభ్యాస్‌లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జి జి హెచ్ అనంతపురం నందు లక్ష్య మరియు ముస్కాన్ సర్టిఫికెట్ల ను పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని ఈ సర్టిఫికెట్లు సాధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని అడ్మినిస్ట్రేటివ్ అధికారికి ఆదేశించారు. 2025 -26 ఆర్థిక సంవత్సరానికి మొదటి త్రైమాసికం లో లక్ష్యాలను సాధించే విధంగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఆసుపత్రుల పరికరాలు,సౌకర్యాల వారీగా HDS ఫండ్ వినియోగం జరిగే విధంగా చూడాలని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్‌స్ట్రుమెంట్స్ & ఎక్విప్‌మెంట్స్, అన్ని హాస్పిటల్స్ కోసం NQAS అనాలిసిస్ చేయాలన్నారు. నాణ్యమైన ధృవీకరణ పత్రాలు పొందడానికి వైద్యాధికారులు, సూపరింటెండెంట్, క్వాలిటీ కమిటీలు ఆరోగ్య సిబ్బంది అందరికీ అవసరమైన శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, శిక్షణ ఇచ్చేందుకు ఒక నోడల్ అధికారిని నియమించాలని, జిల్లా నాణ్యత బృందానికి క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి వాహన ఇతరత్రా సదుపాయాలను కల్పించాలని అన్నారు. జిల్లాలోని పామిడి, గుంతకల్లు ఆసుపత్రులపై వచ్చిన కంప్లైంట్లను వాట్సాప్ ద్వారా డిసిహెచ్ఎస్ దృష్టికి పంపడం జరిగిందని, కళ్యాణదుర్గం సంబంధించిన సమస్యను జనవరి 28 మాసంలో పంపడం జరిగిందని, గుంతకల్లు సంబంధించి అంబులెన్స్ విషయంలో సమస్య ఉందని వాటిపై కూడా ఇంతవరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని అధికారులపై మండిపడ్డారు.

అనంతరం ఐఎస్ఓ గుర్తింపు పొందిన డి ఎం హెచ్ ఓ కార్యాలయానికి ISO 9001:2015 సర్టిఫికేట్ గుర్తింపు లభించడంతో గ్లోబల్ మేనేజ్మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ సంస్థకు అందించిన సర్టిఫికెట్ ను డి ఎం అండ్ హెచ్ ఓ ఈ బి దేవి గారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ ఈ బి దేవి, డి సి హెచ్ ఎస్ పాల్ రవికుమార్, జి జి హెచ్ ఎస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మల్లికార్జున్, ఏపీ ఎస్ఎంఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, జిల్లా నాణ్యత బృందం అధికారులు స్టీఫెన్ ,శైలజమెడికల్ అధికారులు, తదితరసిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆలయప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సత్తి





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 03:** బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామం నందు శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త , మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. వీరి వెంట నల్లమిల్లి వెంకటరెడ్డి , కొవ్వూరి సత్తిబాబు (ఫైనాన్స్ సత్తిబాబు) , కొవ్వూరి సుజాత వెంకట రామారెడ్డి (బలభద్రపురం గ్రామ వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు) , గొలుగూరి దుర్గారెడ్డి , గొలుగూరి మణికంఠ రెడ్డి , కోనాల అనిల్ కుమార్ రెడ్డి తదితరులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైయస్ఆర్‌సీపీ) నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా నందవరం
## శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవాలు !

**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 3:** గత వారం రోజులుగా నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయని. ఈ వేడుకల్లో పాల్గొన్నధర్మవరం చేనేత ప్రముఖులు దాశెట్టి నాగరాజు తెలిపారు. మహిమ కల తల్లి నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి అని ఆయన పేర్కొన్నారు.ఈ ఉత్సవాలు సందర్భంగా పోస్టర్ ప్రచారం ధర్మవరం మాధవ్ సిల్క్స్ తరుపున దాశెట్టి నారాయణ స్వామి, కీ. శే. శ్రీ మతి దాశెట్టి ఓబుళమ్మ దంపతుల సహకారం తో నిర్వహించడం జరిగింది. అక్కడ విచ్చేసిన భక్తులకు నందవరం లో అన్నదానం ఏర్పాట్లు కూడా ఉన్నాయని అన్నారు. ఈ వేడుకలకు చుట్టు పక్కల ప్రాంతాల నుండి అనేకమంది భక్తులు వచ్చారని అన్నారు.చౌడేశ్వరి దేవి ఉత్సవాలు సందర్భంగా చేనేత లకు అందరికీ పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



## బార్ అసోసియేషన్ నూతన కమిటి ఎంపిక

**అంకుశం న్యూస్ ధర్మవరం, ఏప్రిల్ 3:** ధర్మవరం బార్ అసోసియేషన్ నూతన కమిటీని సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఎంపిక చేశారు. ధర్మవరం కోర్టులోనున్న బార్ అసోసియేషన్ నూతన కమిటీని సీనియర్ న్యాయవాదులు ఎంపిక చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎంఏ ఖరీమ్, ప్రధాన కార్యదర్శిగా డీఎల్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షుడుగా నూర్ మహమ్మద్, సహాయ కార్యదర్శిగా వైద్యం బాలసుందరి, కోశాధికారిగా అబ్దుల్ సాబ్, కమిటీ సభ్యులుగా కెఎం రేష్మ, శివకుమార్, మోహన్ ప్రసాద్, నరసింహమూర్తి, పెద్దన్న, బాబా ఫకృద్దిన్, ప్రసాద్, మణికంఠలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఖరీమ్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రధాన కార్యదర్శి డీఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఏడాదిపాటు న్యూస్ పేపర్, తాగునీటి వసతిని బార్ అసోసియేషన్ కి ఉచితంగా తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తానని హామి ఇచ్చారు.



# ఉపాధి హామీ పథకం కింద
# 1 కోటి 20 లక్షల పనిదినాలు కల్పిస్తాం

**- : రూ.375 కోట్లను వేతనాల రూపంలో చెల్లించేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం**

**- : 2024-25 లో జిల్లాలో 2.12 లక్షల కుటుంబాలకు 109.25 లక్షల పనిదినాలు కల్పించి, రూ. 287.01 కోట్లను వేతనాల రూపంలో ఉపాధి కూలీలకు చెల్లించాం**

**- : ఉపాధి హామీ పనులను జాబ్ కార్డుదారులు విరివిగా ఉపయోగించుకోవాలి**

**- : ప్రెస్ మీట్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**

**అంకుశం ప్రతినిధి అనంతపురం, ఏప్రిల్ 03 :** అనంతపురం జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో ప్రజలకు ఉపాధి హామీ పథకం కింద ఒక కోటి 20 లక్షల పని దినాలు కల్పిస్తామని కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారులిఅనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో 2024-25వ ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సాధించిన ప్రగతి మరియు 2025-26వ ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ప్రెస్ మీట్ నిర్వహించారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకం విజయవంతంగా అమలు చేయడం ద్వారా మరియు కూలీలకు ఉపాధి, గ్రామీణ ప్రాంతాలలో మౌళిక సదుపాయాల కల్పన మరియు సుస్థిర ఆస్తుల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ పథకం మౌళిక సదుపాయాల కల్పన మరియు సుస్థిరమైన ఆస్తుల ఏర్పాటుకు ఒక వరంలాంటిదన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతికి సంబంధించి జిల్లాలో 2.12 లక్షల కుటుంబాలకు 109.25 లక్షల పనిదినాలు కల్పించి, 287.01 కోట్ల రూపాయలను వేతనాల రూపంలో ఉపాధి కూలీలకు చెల్లించడం జరిగిందని తెలిపారు.

- ఉపాధి హామీ పథకం కింద నీటి నిల్వ మరియు సంరక్షణ పనుల కింద 238 చెరువుల యందు పూడిక తీత పనులు, 575 సేద్యపు నీటి కుంటలు, 1,276 కొండల యందు నీటి నిల్వ కందకాలు, 2,347 డగ్ అవుట్ పాండ్స్, 374 పంట కాలువలలో పూడిక తీత పనులు చేపట్టామన్నారు. మౌలిక వసతులకు సంబంధించి 194.57 కిలోమీటర్ల సిసి రోడ్లను 73 కోట్ల 86 లక్షల 18 వేల రూపాయలతో, 10.39 కిలోమీటర్ల బిటి రోడ్లను 4 కోట్ల 85 లక్షల 60 వేల రూపాయలతో, 7.25 కిలోమీటర్ల సిసి డ్రైన్స్ ను మూడు కోట్ల 93 లక్షల 60 వేల రూపాయలతో, 1,437 పశువుల షెడ్లను 29 కోట్ల 16 లక్షల 90 వేల రూపాయలతో చేపట్టడం జరిగిందని తెలిపారు. పశువుల షెడ్లకు సంబంధించి రాష్ట్రంలో అనంతపురం జిల్లా రెండవ స్థానంలో ఉందన్నారు.

- జిల్లాలో గత సంవత్సరం పూర్తి చేసిన నీటి నిల్వ మరియు సంరక్షణ పనుల ద్వారా 1.74 %వీజ% ల నీటిని భూగర్భ జలాలుగా పెంపొందించడం జరిగిందన్నారు. ఉద్యాన పంటలకు సంబంధించి 8051.94 ఎకరాలలో (3220.77 హె.) విస్తీర్ణములో ఉద్యాన పంటలలో వివిధ రకాలైన మామిడి, దానిమ్మ, బత్తాయి, జామ, నేరేడు మొదలగు పండ్ల తోటల పెంపకము చేపట్టడం జరిగిందన్నారు.

- 2025-26 ఆర్థిక సంవత్సరం లో 120.00 లక్షల పనిదినాలు కల్పించి 375.00 కోట్ల రూపాయలు వేతనాల రూపంలో చెల్లించడానికి లక్ష్యముగా నిర్దేశించుకున్నామన్నారు. 2025-26 మొదటి త్రైమాసికములో భాగంగా ఏప్రిల్ నెలకు 24.62 లక్షల పనిదినాలు, మే నెలకు 32.59 లక్షలు, జూన్ నెలకు 10.79 లక్షల పనిదినాలు కలిపి మొత్తం 68.00 లక్షల పనిదినాలు పూర్తి చేసేందుకు లక్ష్యముగా నిర్దేశించామన్నారు. అలాగే 8,000 ఎకరాలలో పండ్లతోటల పెంపకము చేపట్టనున్నామన్నారు. ఉపాధి హామీ కింద పనులు జరుగుతున్న ప్రాంతంలో కూలీలకు అవసరమైన నీడ ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, మజ్జిగ అందించడం, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఉద్యాన పంటలకు సంబంధించి ఉపాధి హామీ, ఎమ్ఐడిహెచ్ (ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్) పథకాలు ఉన్నాయని, దాని కింద 1,500 హెక్టార్లలో ఉద్యాన పంటలను క్రాప్ సబ్సిడీ, ప్లాంట్ మెటీరియల్ ఇస్తూ



ప్రోత్సహిస్తున్నామన్నారు.

- 2025-26 ఆర్థిక సంవత్సరం లక్ష్యాలు మరియు కార్యాచరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 646 పశువుల నీటితొట్టెల నిర్మాణాలు, 31 చెరువుల పునరుద్ధరణ పనులు, 9 వేల ఫారం పాండ్స్ నిర్మాణాలు, 93 కిలోమీటర్ల మేర సప్లై మరియు ఫీడర్ చానల్ యందు పూడిక తీత పనులు, సగటు వేతనంలను "పంచ ప్రాధాన్యతలు" గా నిర్దేశించుకొని రాబోవు మూడు మాసాలకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సగటు వేతనం రూ.307/- పొందే విధంగా గ్రూప్ మార్కింగ్ ఇచ్చి పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నీటి నిల్వ మరియు భూసార సంరక్షణ పనులను చేపట్టి భూగర్భ జలాలు పెంపొందించేందుకు, రైతులకు సుస్థిర ఆదాయ వనరులను కల్పించుటలో భాగంగా పండ్లతోటల పెంపకం, మౌలిక వసతులలో భాగంగా సిసి రోడ్లు, బిటి రోడ్లు, సిసి డ్రైన్స్, పశువుల తొట్టెలు మొదలకు పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు.

- ఈ ప్రెస్ మీట్ లో డ్వామా పిడి సలీమ్ భాష, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసిన మాజీ ఎంపీపీ జ్యోతిర్మయి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 03:** వైఎస్సార్సిపి పార్టీ గుర్తు పై గెలిచి, ప్రభుత్వం మారిన తరువాత తన పార్టీకి, ఎంపీపీ పదవికి న్యాయం చేయలేక పోతున్నాననే మనస్తాపంతో ఎంపీపీ పదవికి రాజీనామా చేసినట్లు కొవ్వూరి జ్యోతిర్మయి శేషుకుమారి కొమరిపాలెం ఎంపీటీసీ - 2 పదవికి రాజీనామా సమర్పించిన్నట్లు మీడియాకు తెలిపారు.

## పన్ను వసూళ్లలో మండపేట మున్సిపాలిటీ జిల్లాలో నెంబర్ 1 స్థానం




**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 03:** మండపేట మున్సిపల్ కమీషనర్ టివి రంగారావు కృషి ఫలించింది. పన్ను వసూళ్లలో రికార్డు స్థాయి వసూళ్లు సాధించి మండపేట మున్సిపాలిటీ జిల్లాలో నెంబర్ 1 స్థానం లో నిలిచింది. పన్ను వసూళ్లకు సంబంధించి గత కొన్ని రోజులుగా కమీషనర్ పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్లారు. మున్సిపల్ ఆర్వో, ఆర్.ఐ ల ఆధ్వర్యంలో సిబ్బంది ఇందుకు చక్కటి సహకారం అందించడంతో 2024 - 25 ఆస్తి పన్ను వసూళ్లలో మండపేట 76.73 శాతం వసూళు సాధించి జిల్లాలో మొదటి స్థానం తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 10వ స్థానంలో నిలిచింది.

## రాయల్ స్టే గెస్ట్ హౌస్ ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కదిరి

**కనిగిరి ఏప్రిల్ 3 అంకుశం న్యూస్:** కనిగిరి నియోజకవర్గం సిఎస్ పురం మండలం సి ఎస్ పురం పట్టణానికి చెందిన ప్రముఖ రియల్ టర్ తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసులు గెస్ట్ హౌస్ ను హైదరాబాద్ లోని పఠాన్ చెరువులో గురువారం కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు ప్రారంభించారు.అనంతరం రాయల్ స్టే గెస్ట్ హౌస్ ప్రోప్రైటర్ శ్రీరామ్ శ్రీనివాసులు కదిరి బాబురావు, కదిరి ప్రకాష్ రావులను దుశ్శాలవతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ పురం వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పి మల్లికార్జున రెడ్డి, సి ఎస్ పురం మండల వైస్ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, ఆనికాలపల్లి సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, శేఖర్, సత్యం, గడ్డం వెంకటేశ్వర్లు, ప్రెస్ మోహన్ తదితరులు పాల్గొని శ్రీరాం శ్రీనివాసులు ను వ్యాపారాభివృద్ధిలో రాణించాలని ఆశీర్వదించారు.

